ఆసరాతో అక్కచెల్లెమ్మలకు భరోసా

చీరల వ్యాపారం చేస్తున్న ఈమె పేరు చౌడమ్మ, శింగనమల గ్రామం. ఈమె నల్లమ్మ మహిళ సంఘంలో సభ్యురాలు. ఈ సంఘంలో 12 మంది సభ్యులున్నారు. వీరి సంఘానికి రూ.7,03,325 రుణమాఫీ అయింది. నాలుగు విడుతల్లో ఒక్కో మహిళకు రూ.58,610 వచ్చింది. ఈమెకు వచ్చిన వైఎస్సార్ ఆసరాను సద్వినియోగం చేసుకుని, ఇంట్లోనే చీరల వ్యాపారం చేసుకుంటున్నారు. మహిళలకు తోడ్పాటునందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటామన్నారు.



కిరాణా షాపు నడుపుకుంటున్న ఈమె పేరు జెల్లి వెంకటలక్ష్మి, శింగనమల గ్రామం. ఈమె చైతన్య మహిళ సంఘంలో సభ్యురాలు. ఈ సంఘంలో 11 మంది సభ్యులున్నారు. వీరికి వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.7,35,372 రుణమాఫీ జరిగింది. ఒక్కొక్కరికి నాలుగు విడతల్లో రూ.66,852 వచ్చింది. ఈమెకు వచ్చిన వైఎస్సార్ ఆసరా నగదును సద్వినియోగం చేసుకుని కిరణాషాపు నడుపుకుంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు.



- ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- ముఖ్యమంత్రికి రుణపడి ఉంటామంటున్న మహిళలు
- గతంలో చంద్రబాబు మోసం చేశారంటూ మండిపాటు

శింగనమల: మహిళా సాధికారత, స్వావలంభన దిశగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. గతంలో చంద్రబాబు నాయుడు డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని హామీ ఇచ్చి మోసం చేయడంతో మహిళా సంఘాల సభ్యులు రుణాలు సకాలంలో చెల్లించలేక, డిఫాల్ట్ దిశగా సంఘాలు కూరుకుపోయాయి. ఈ తరుణంలో గత ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేరుస్తూ, డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేయడమే గాక, సున్నా వడ్డీని అందిస్తూ, మహిళలకు ఆర్థిక భరోసా కల్పించారు. వైఎస్సార్ ఆసరా ద్వారా రుణమాఫీని నాలుగు విడతల్లో వేయడంతో, మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామంటున్నారు.



శింగనమల నియోజకవర్గంలోని 4,831 సంఘాలున్నాయి. ఈ సంఘాల్లోని అక్కచెల్లెమ్మలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు విడతల్లో 169.64 కోట్లు రుణమాఫీ చేశారు. అలాగే తాడిపత్రి నియోజకవర్గంలోని 2,731 సంఘాల్లోని అక్కచెల్లెమ్మలకు నాలుగు విడతల్లో రూ.92.36 కోట్లు రుణమాఫీ అందించారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు.

శింగనమల నియోజకవర్గంలో వివరాలు ఇలా

మండలం	సభ్యుల సంఖ్య
నార్పల	1,055
బుక్కరాయసముద్రం	1,046
గార్లదిన్నె	928
శింగనమల	624
యల్లనూరు	590
పుట్లూరు	588

క్లుప్తంగా

వాహనదారులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ మహమ్మద్ గౌస్

గార్లదిన్నె: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ద్విచక్రవాహన దారులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ మండల కేంద్రం గార్లదిన్నెలో కొంతమంది యువకులు బైక్ రేస్‌తో వాహనదారులను ఇబ్బందులు గురిచేస్తున్నారన్నారు.అలాగే రోడ్డుపై ద్విచక్రవాహనాలు ప్రమాదకరంగా విన్యాసాలు చేస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. మళ్లీ బైక్ రేస్‌లో ఇబ్బందిపెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి

తాడిపత్రిటౌన్: మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా యువత సృజనాత్మకతతో ఆలోచించి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని వక్తలు అన్నారు. పట్టణంలోని సర్ సీవీ రామన్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో అనంతపురం ఆర్డీటీ సహకారంతో సృజనా శిబిరం కార్యక్రమంలో భాగంగా ఇనోవేషన్ అండ్ ఎంటర్ ప్రిన్యూయర్‌షిప్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సును ప్రిన్సిపాల్ ఇందుదర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎస్‌కే యూనివర్శిటీ అటల్ ఇంకుబేషన్ కేంద్రం మేనేజర్ చంద్రమౌళి, షహీన్, జ్యోతి పాల్గొన్నారు.

నిరంజన గురురంగస్వామి ఆరాధన



అలంకరణలో గురురంగస్వామి

పుట్లూరు: మండలంలోని ఎస్.తిమ్మాపురంలో శుక్రవారం నిరంజన గురురంగస్వామి ఆరాధన వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే గ్రామంలో సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు

పారిశుధ్యం మెరుగుపరచాలి



పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కమిషనర్ వెంకట రమణయ్య

గుంతకల్లుటౌన్: పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని శానిటేషన్ అధికారులు, వార్డు కార్యదర్శులను మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని హనుమేష్‌నగర్, గంగానగర్ ఏరియాల్లో పర్యటించిన ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు. శానిటేషన్ కార్యదర్శులు, పీహెచ్ వర్కర్ల పనితీరుపై స్థానికులతో ఆరాతీశారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, చెత్తా చెదారాన్ని ఇంటి వద్దకు వచ్చే ఆటోల్లోకి వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

విద్యతో ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు

గుంతకల్లు రూరల్: విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని కేజీబీవీ విద్యార్థినులకు ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు సూచించారు. శుక్రవారం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ధర్మవరానికి చెందిన ఆత్మీయ ట్రస్ట్ ఆధ్వర్యంలో యూటీఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్స్ పుస్తకాలతోపాటు, పరీక్షల సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ శెట్టిపి జయచంద్రారెడ్డి, కోశాధికారి రాఘవేంద్ర, సభ్యుడు ఆదిశేషు, ప్రిన్సిపాల్ మెహమూదా బేగం పాల్గొన్నారు.

'జగనన్న గోరుముద్ద' తనిఖీ



భోజన నాణ్యతను పరిశీలిస్తున్న తహసీల్దార్ మల్లికార్జునస్వామి

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న గోరుముద్ద కార్యక్రమాన్ని శుక్రవారం తహసీల్దార్ మల్లికార్జునస్వామి, ఎంపీడీఓ దస్తగిరి అకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద కార్యక్రమం ద్వారా పిల్లలకు అందించే భోజన నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఏజెన్సీ సభ్యులకు సూచించారు. అనంతరం వారు విద్యార్థులతో మాట్లాడారు. భోజనానికి ముందు చేతులను సబ్బుతో శుభ్రపరుచుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



అమీర్‌బాషా కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి



మహాలక్ష్మికి నియామక పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

గుంతకల్లుటౌన్: పట్టణంలోని అమీర్‌బాషా, కొనకొండ్ల గ్రామానికి చెందిన గుట్టమీద రాజు కుటుంబాలకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అందజేశారు. శుక్రవారం ఎమ్మెల్యే తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన రాజుకు రూ.5 లక్షలు, అమీర్‌బాషా కుటుంబసభ్యులకు రూ.3 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. పిల్లలను బాగా చదివించుకుని ప్రయోజకులుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా వారు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే వైవీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ భార్యకు నియామక పత్రం

గుంతకల్లు రూరల్: బ్రెయిన్ స్ట్రోక్ కారణంగా మృతి చెందిన గుర్రబ్బాడు ఫీల్డ్ అసిస్టెంట్ వీరాంజనేయులు భార్యకు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.5 లక్షల చెక్కుతోపాటు, ఫీల్డ్ అసిస్టెంట్ నియామక పత్రాలను ఎమ్మెల్యే వైవీఆర్ అందజేశారు. విధి నిర్వహణలో ఉండగా బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన వీరాంజనేయులు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రెండు నెలల క్రితం మృతిచెందాడు. దీంతో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చిన ఎమ్మెల్యే వైవీఆర్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. దీంతో డ్వామా నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును శుక్రవారం వీరాంజనేయులు భార్య మహాలక్ష్మికి అందజేయడంతో పాటు ఆమెను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమిస్తూ ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు. దీంతో ఆపదలో ఉన్న వీరాంజనేయులు కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలిచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యేకు మహాలక్ష్మి, గుర్రబ్బాడు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు.

అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలి

గుత్తి రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని చెట్నేపల్లి, ధర్మాపురం గ్రామ శివార్లలో ఉన్న తమ భూములను కొందరు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వాటిని రద్దు చేయాలని సూరశింగనపల్లి వాసులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ భారతికి వినతిపత్రం అందజేశారు. ఎస్‌ఎస్.పల్లి వాసులు వెంకటకృష్ణ, సాయిప్రసాద్, కృష్ణమూర్తి, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ మాట్లాడుతూ చెట్నేపల్లి శివారులోని 212సీ, 215బీ, 216సీ-1, 216డీ, 147, 148సీ, 151, ధర్మాపురం గ్రామ శివారులోని 60 సర్వే నంబర్లలో పూర్వీకుల నుంచి తమకు భూములు ఉన్నాయన్నారు. అయితే కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు, తప్పుడు పాసుపుస్తకాలు, జీపీలను సృష్టించి అక్రమంగా 30 ఎకరాలను వేరే వ్యక్తులపై రిజిస్టర్ చేశారన్నారు. తక్షణమే అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశ్వరయ్య, శేషు, హరి పాల్గొన్నారు.

రోడ్డు భద్రత చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

తాడిపత్రి అర్బన్: రోడ్డు భద్రత చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ సూచించారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ ఉద్యోగుల బైక్ ర్యాలీని ఆర్టీసీ డీఎం శంకర్‌తో కలసి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఎంవీఐ రాజగోపాల్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. అలాంటి వారిని ప్రోత్సహించేందుకు రూ.5వేల నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందిస్తామన్నారు.



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంవీఐ, డీఎం

డీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డిపో మేనేజర్ నందిని, ఆర్టీసి ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రధానికి రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

తాడిపత్రి అర్బన్: ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలని బీజేపీ ఓబీసీ మోర్చా డిమాండ్ చేసింది. ఒరిస్సాలో జరుగుతున్న భారత్ జోడో యాత్రలో ప్రధాని వ్యక్తిగత జీవితంపై రాహుల్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో రాహుల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ జిల్లా గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్, నియోజకవర్గ కన్వీనర్ రంగనాథరెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీకి వయసు పెరిగినా బుద్ధి రాలేదన్నారు. ప్రధాని పాలన గురించి మాట్లాడలేక ఆయన వ్యక్తిగత జీవితంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం కారణంగానే 2019 ఎన్నికల్లో దేశ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పారన్నారు. ఓబీసీ మోర్చా ఇన్‌చార్జ్ రామాంజనేయులు, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ అశోక్, జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, వాణిజ్యసెల్ కన్వీనర్ శేషఫణి, నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఉరుసు

శింగనమల: మండల కేంద్రంలోని మసూద్ గాజి దర్గా ఉరుసును మూడు రోజులు పాటు దర్గా కమిటీ సభ్యులు వైభవంగా నిర్వహించారు. శుక్రవారం జియారత్‌తో ఉరుసు ముగిసింది. భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు, చక్కెర చదివింపులు చేశారు. రాత్రి ఆర్కెస్ట్రా నిర్వహించారు. సీఐ శ్రీధర్, ఎస్‌ఐ చంద్రశేఖర్, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



గుంతకల్లులో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మందులు వేస్తున్న దృశ్యం

గుంతకల్లు/గుత్తి/గార్లదిన్నె/యాడికి/బుక్కరాయసముద్రం/యల్లనూరు: తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లోని అన్ని గ్రామాల్లో 2 నుంచి 19 ఏళ్ల లోపు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. వైద్యులు మాట్లాడుతూ నులి పురుగుల నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు శుక్రవారం నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు.



గార్లదిన్నెలో..

విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలకు ఆహ్వానం

తాడిపత్రిటౌన్: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శుక్రవారం పెద్దపప్పూరు మండలంలోని గార్లదిన్నె గ్రామ సమీపంలో నూతనంగా నిర్మించిన కాశిరెడ్డి నాయన ఆలయంలో విగ్రహాల ప్రతిష్ట మహోత్సవానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిని గార్లదిన్నె గ్రామస్తులు ఆహ్వానించారు. ఆలయంలో ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకూ గణపతి, ఈశ్వర, ఆంజనేయస్వామి, నవగ్రహాలు, ధ్వజశిఖర, కాశిరెడ్డి నాయన విగ్రహాల ప్రతిష్టను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమానికి హాజరై స్వామి ఆశీర్వాదం తీసుకోవాలని ఆయన్ను గ్రామస్తులు కోరారు. అనంతరం ఆయనకు విగ్రహ ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో బాలపెద్దిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, కొండారెడ్డి, ఆలూరు నారాయణరెడ్డి, రంగారెడ్డి, విజయ్, ఓబిరెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గార్లదిన్నె గ్రామస్తులు

సజావుగా మండల సమావేశం

యల్లనూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, ఉపాధి, స్వయం సహాయ సంఘాలు, జగనన్న గృహాలు, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, స్త్రీ శిశు సంక్షేమం వంటి అభివృద్ధి ప్రగతిపై శాఖల ప్రాముఖ్యతలను చదివి వినిపించారు. యల్లనూరును కరువు మండలంగా ప్రకటించడంతో రబీ సీజన్‌లో ఈ క్రాప్ ఆధారంగా క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలను తయారు చేస్తున్నామని ఏఓ రామకృష్ణుడు తెలిపారు. ఈ-కేవైసీ ఇంకా 200 మంది రైతులు చేయించుకోలేదన్నారు. జగనన్న ఇళ్లు మండలానికి 186 మంజూరయ్యాయని, ఇందులో 99 పూర్తయ్యాయని హౌసింగ్ ఏఈ సుప్రజ తెలిపారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రణాళికలను తయారు చేసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూస్ ఏఈ సుప్రజ అన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగయ్య, సొసైటీ అధ్యక్షుడు కిరణ్, ఎంపీడీఓ వీరరాజు, వైద్యుడు లోకేష్, ఎంఈఓ పరమేశ్వరరెడ్డి, ఐకేపీ ఏపీఎం ముత్యాలప్ప, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజామణి, పీఆర్ జేఈ నరేంద్ర, సర్పంచులు రామాంజులరెడ్డి, అశోక్‌కుమార్‌రెడ్డి, నాగరాజు, పెద్ద ఓబులమ్మ, శారద తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రజ

'జగనన్న ఆరోగ్య సురక్ష' పేదలకు వరం



యాడికిలో కంటి పరీక్షలు చేస్తున్న దృశ్యం



శింగనమలలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

యాడికి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 3వ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం సర్పంచు పండు అనురాధ అధ్యక్షతన నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యాధికారి శ్రీరామ్ కుమార్, అనంతపురం నుంచి వచ్చిన వైద్య నిపుణులు మీనాక్షి, శ్రీనివాసులురెడ్డి, కంటి వైద్య నిపుణుడు మధుసూదన్‌రాజు దాదాపు 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సావిత్రి, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ ఈఓ ఎర్రిస్వామి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఎంపీటీసీలు వెంకటనాయుడు, అవుకు నాగరాజు, రామ్మోహన్, సచివాలయాల మండల కన్వీనర్ శివప్రసాద్, రాయలచెరువు, లక్ష్మంపల్లె సర్పంచులు తలారి అరుణ, పద్మనాభ రెడ్డి, వార్డు సభ్యులు తిరుపతి, రామచంద్ర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల: మండలంలోని లోలూరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. లోలూరు, రఘునాథపురం, లోలూరు క్రాస్, సప్తగిరి క్యాంపర్, ట్రాక్టర్ నగర్ నుంచి వచ్చిన 452 మందికి వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమణ, తరిమెల పీహెచ్‌సీ వైద్యులు శంకర్‌నాయక్, మానస, సుశాంత్ కుమార్, తేజశ్వణి, సీహెచ్‌ఓ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో ఉచిత వైద్యశిబిరం

గుంతకల్లుటౌన్/తాడిపత్రి అర్బన్: రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో విజేత హాస్పిటల్ సహకారంతో ఆర్టీసీ అధికారులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు 88 మంది ఆర్టీసీ ఉద్యోగ, కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఆర్టీసీ డీఎం నారాయణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు రోడ్డు భద్రతా నియమాలు, జాగ్రత్తలపై విద్యార్థులు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అలాగే తాడిపత్రి బస్టాండ్‌లో స్థానిక జైస్వీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత హెల్త్ క్యాంపు ఏర్పాటు చేశారు. డీఎం శంకర్, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తాడిపత్రి అర్బన్: పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 6.30 నుంచి 11 గంటల వరకూ కరెంట్ సరఫరా నిలిపివేస్తామన్నారు. తేరన్నపల్లి 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు చేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని ఆలూరు రోడ్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏడీఈ రంగస్వామి, ఏఈ రఘునాథ్‌లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని భాగ్యనగర్, మండీబజార్, హనుమేష్‌నగర్, మోదినాబాద్, పోర్టర్స్‌లైన్ తదితర ఏరియాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

గాయపడిన ఆవులు ఆశ్రమానికి తరలింపు

పెద్దవడుగూరు: మండలంలోని కాశేపల్లి టోల్‌గేట్ వద్ద మంగళవారం రాత్రి జరిగిన కంటైనర్ ప్రమాదంలో సుమారుగా 26 ఎద్దులు, 9 ఆవులు మృతి చెందిన విషయం విదితమే. అందులో గాయపడిన 13 ఆవులను చికిత్స నిమిత్తం పెద్దవడుగూరు పశువైద్యశాలకు తరలించి, చికిత్స అనంతరం వాటిని కాశిరెడ్డి నాయన ఆశ్రమానికి తరలించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఆవులను తరలిస్తే కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు.

11న సంగీత విభావరి

తాడిపత్రి అర్బన్: పద్మశ్రీ ఘంటసాల 50వ వర్ధంతిని పురస్కరించుకుని ఈనెల 11న సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని మార్కండేయస్వామి ఆలయంలో పాడుతా తీయగా చల్లగా సంగీత విభావరిని ఏర్పాటు చేయనున్నట్లు బహూత్తమ పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు గద్దం గణేష్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఘంటసాల, సంగీత అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పుట్లూరు: మండలంలోని నారాయణపల్లి, వెంగన్నపల్లి, గోపురాజుపల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహసీల్దార్ మల్లికార్జునస్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల్లో వసతులపై ఆరా తీశారు. కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఈయన వెంట ఎంపీడీఓ దస్తగిరి ఉన్నారు.

ధర్మకర్తల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తాడిపత్రిటౌన్: పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థనారాయణస్వామి, భీమలింగేశ్వరస్వామి ఆలయాలకు సంబంధించి ధర్మకర్తల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈనెల 20లోపు దేవదాయ శాఖ, కర్నూలు డివిజన్ ఉప కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

లడ్డూ విక్రయ హక్కుల వేలంలో రూ.4.80 లక్షల ఆదాయం

తాడిపత్రిటౌన్: పెద్దపప్పూరు మండలంలోని అశ్వత్థ నారాయణస్వామి ఆలయంలో శుక్రవారం మాఘమాసం బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని లడ్డూ ప్రసాద విక్రయాలకు వేలం నిర్వహించారు. వేలంలో అనంతపురం పట్టణానికి చెందిన లక్ష్మీనరసమ్మ రూ.4.80 లక్షలకు వేలం పాడి లడ్డూ ప్రసాద విక్రయాల హక్కును దక్కించుకున్నారని ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, కమిటీ చైర్మన్ శ్రీనివాసులరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

పారిశ్రామిక రంగంపై అవగాహన అవసరం



ఇండస్ట్రియల్ టూరులో విద్యార్థులు

బుక్కరాయసముద్రం: ఇంజినీరింగ్ విద్యార్థులు చదువులతో పాటు పారిశ్రామిక రంగంపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలక్రిష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సీఎస్‌ఈ తృతీయ సంవత్సరం విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా బెంగళూరులోని వైట్‌ఫీల్డ్‌లో కేటీపీఓలో జరుగుతున్న ఐఓటీ ఎక్స్‌పోను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు నలుగురికి ఉపాధి కల్పించే ఇండస్ట్రీలు స్థాపించే స్థాయికి ఎదగాలన్నారు. ఇటువంటి సదస్సులు విద్యార్థులకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం అధిపతి వీర ప్రకాష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

19న లక్ష్మీనారాయణస్వామి విగ్రహ ఊరేగింపు



మాట్లాడుతున్న స్వామీజీ

గుంతకల్లు రూరల్: మండలంలోని కసాపురంలో టీపీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు జరుగనున్న నేపథ్యంలో ఈనెల 19న నిర్వహించే విగ్రహ ఊరేగింపును విజయవంతం చేయాలని ట్రస్టు అధినేత తలారి పరశురాముడు కోరారు. ఈసందర్భంగా శుక్రవారం ఆలయంలో వివిధ కులసంఘాలతో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి తిరుపతి అన్నమాచార్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామీజీ, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ రామలింగప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ నెల 22న స్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా ఈ నెల 19న నిర్వహించే ఊరేగింపు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.